క్లుప్తంగా

'జవహర్ నవోదయ'కు ఎంపిక



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని విజ్ఞాన జ్యోతి హైస్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న పాలెపు లోక్షిత్ జవహర్ నవోదయ విద్యాలయానికి ఎంపికైనట్లు కరస్పాండెంట్ గుండోజీ దేవేందర్ తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి నవోదయ విద్యాలయం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు లోక్షిత్ హాజరైనట్లు వెల్లడించారు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో నిజాంసాగర్ నవోదయ విద్యాలయంలో సీటు సాధించినట్లు పేర్కొన్నారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యాజమాన్యం లోక్షిత్‌ను శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. హెచ్ఎం సౌమ్య, సరిత పాల్గొన్నారు.

ఆర్మూర్ నుంచి విద్యార్థిని..



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణానికి చెందిన డి. మాల్యద అనే విద్యార్థిని నవోదయ పాఠశాలకు ఎంపికైందని వివేకానంద స్టడీ సర్కిల్ నిర్వాహకురాలు వనిత ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణ పాఠశాలలో 5వ తరగతి చదువుతుందని, ఇటీవల విడుదలైన నవోదయ ఫలితాల్లో సీటు సాధించిందని ఆమె పేర్కొన్నారు.

అమృత్ ఉద్యాన్‌లో వైద్యసేవలు



వేల్పూర్: వాడి గ్రామానికి చెందిన వైద్యుడు గోలి శ్రీనివాస్ రాష్ట్రపతి భవన్(న్యూఢిల్లీ)లో గల అమృత్ గార్డెన్‌లో ఫిబ్రవరి, మార్చి నెలల్లో వైద్య సేవలందించినట్లు సోమవారం తెలిపారు. న్యూఢిల్లీలోని నగరపాలక సంస్థ సీనియర్ మెడికల్ ఆఫీసర్‌గా గోలి శ్రీనివాస్ విధులు నిర్వహిస్తున్నారు. జనవరిలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధ్యక్షతన జరిగిన రిపబ్లిక్ డే వేడుకలు, బీటింగ్ రీట్రీట్ వేడుకల్లో వైద్యసేవలందించిన మెడికల్ టీమ్‌కు నాయకత్వం వహించినట్లు వెల్లడించారు.

తడి, పొడి చెత్త వేరు చేయాలి



రుద్రూర్: తడి, పొడి చెత్త వేరు చేసి కంపోస్ట్ ఎరువు తయారు చేయాలని బోధన్ డీఎల్‌పీవో సాయిబాబా ఆదేశించారు. రుద్రూర్ మండల కేంద్రంలోని కంపోస్ట్ షెడ్, హరితహారం నర్సరీని సోమవారం ఆయన పరిశీలించారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున నర్సరీలో వాటరింగ్ చేయాలని, మొలకలు రాని మొక్కల స్థానంలో కొత్తవి నాటాలని, నర్సరీ స్టాక్ రిజిస్టర్ పక్కాగా నిర్వహించాలని సూచించారు. డీఎల్‌పీవో వెంట మండల పంచాయతీ అధికారి సాయిలు, గ్రామ పంచాయతీ కార్యదర్శి గంగాధర్ ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం



రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రంలో సోమవారం ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎండలు తీవ్రమవుతున్నందున మండల కేంద్రానికి వచ్చే వారి దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. సేవా దృక్పథంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన మహిళా సభ్యులకు స్థానికులు అభినందనలు తెలిపారు.

ఆస్తి పన్ను వసూళ్లు రూ.4.31 కోట్లు

బోధన్‌టౌన్(బోధన్): 2023–24 ఆర్థిక సంవత్సరానికి బోధన్ బల్దియాలో రూ.4 కోట్ల 31 లక్షల ఆస్తి పన్ను వసూలయ్యాయి. మొత్తం ఆస్తి పన్ను రూ.6 కోట్ల 34 లక్షలు రావాల్సి ఉండగా.. ఆర్థిక సంవత్సరం ముగింపు మార్చి 31 తేదీ వరకు రూ.4 కోట్ల 31 లక్షలను అధికారులు వసూలు చేశారు. 71.05 శాతం ఆస్తి పన్ను వసూలైనట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ తెలిపారు.

ఫలించని 90 శాతం రిబేట్

గతంలో బకాయిలు ఉన్నవారు ఆస్తి పన్ను చెల్లిస్తే 90 శాతం వడ్డీ మాఫీ అవుతుందని, వడ్డీ కేవలం 10 శాతం మాత్రమే చెల్లించాలని అవకాశం ఇచ్చినా ఫలితం చూపలేదు.

భవనం పూర్తయ్యేదెప్పుడో?

- రెండేళ్లుగా కొనసాగుతున్న పోచంపాడ్ ప్రభుత్వ పాఠశాల నిర్మాణ పనులు
- ఇంకా అసంపూర్తిగానే ఉన్న వైనం



పూర్తి కాని అదనపు తరగతి గదుల నిర్మాణం



అసంపూర్తిగా ఉన్న పోచంపాడ్ ప్రభుత్వ పాఠశాల భవనం

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవన నిర్మాణం నత్తనడకన సాగుతోంది. పోచంపాడ్ పాఠశాలలో తెలుగు, ఇంగ్లిష్‌తో పాటు ఉర్దూ మీడియం కూడా కొనసాగుతుంది. పాఠశాల భవనం రేకుల షెడ్డుతో ఉండటంతో మన ఊరు –మనబడి పథకంలో భాగంగా పాఠశాల భవనం నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.కోటి నిధులను మంజూరు చేసింది. కానీ పనులు ఆరు నెలలు ముందుకు.. ఏడాది వెనక్కు అన్నట్లు సాగుతూ వచ్చాయి. ఎట్టకేలకు స్లాబ్ వరకు పూర్తయ్యాయి. మిగతా పనులు ముందుకు సాగడం లేదు. ఎప్పుడు పూర్తవుతాయో కూడ తెలియని పరిస్థితి నెలకొంది. పాఠశాలలో సుమారు 360 మంది విద్యార్థులు చదువుతున్నారు. పూర్వపు రేకుల షెడ్డు భవనంలో సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆర్ఎంఎస్ ద్వారా మంజూరైన నిధులతో కూడా పనులు ముందుకు సాగడం లేదు. నిధులు మంజూరైనా కొన్నాళ్ల వరకు పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. పాత ఎస్ఎల్ఆర్ ధరల ప్రకారం టెండర్ పిలువడంతో ముందుకు రాలేదు. వచ్చిన కాంట్రాక్టర్లకు బిల్లులు సరిగా రావడం లేదు. పోచంపాడ్ ఉన్నత పాఠశాలలో పోచంపాడ్, సోన్‌పేట్, దూదిగాం విద్యార్థులు చదువుతారు. మూడు మీడియంలు కావడం వల్ల విద్యార్థులకు తరగతి గదులు కూడ ఎక్కువగానే అవసరం ఉన్నాయి. కానీ ఇవన్నీ పాలకులకు, ఉన్నత అధికారులకు పట్టడం లేదు. సర్కార్ బడికి విద్యార్థులను పంపండి అంటూ ప్రచారమే తప్ప కనీస వసతులను గురించి పట్టించుకునే నాథుడే లేరని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత అధికారులు స్పందించి కనీసం వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికైనా పనులు పూర్తి చేసి నూతన భవనాన్ని ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రాథమిక పాఠశాల పరిస్థితీ అంతే..

ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం రూ.25 లక్షల నిధులు మంజూరయ్యాయి. కానీ పనులు చాలా రోజుల తరువాత ప్రారంభించారు. ఆ పనులు కూడ అసంపూర్తిగానే ఉన్నాయి. ప్లాస్టరింగ్ ఇంకా కాలేదు. దీంతో విద్యార్థులు తరగతి గదుల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అదనపు తరగతి గదులను కూడా వెంటనే పూర్తి చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

టెట్ ఫీజును తగ్గించాలి

- పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నేత నరేందర్

ఆర్మూర్: పెంచిన టెట్ పరీక్ష ఫీజును వెంటనే తగ్గించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా అధ్యక్షుడు నరేందర్ డిమాండ్ చేశారు. ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఆయన మాట్లాడారు. గతంలో టెట్ పరీక్ష ఫీజు రూ.300 ఉండేదని ఇప్పుడు దాన్ని ఒక పరీక్షకు రూ.1000 చేశారని రెండు పరీక్షలు కలిపి రూ.2 వేలు అవుతోందని వివరించారు. పెంచిన ఈ ఫీజులు నిరుద్యోగులపై ఆర్థిక భారాన్ని మోపుతున్నాయి కాబట్టి తగ్గించాలని కోరారు. అదేవిధంగా ప్రతీ జిల్లా కేంద్రంలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ ఆర్మూర్ ఏరియా ప్రధాన కార్యదర్శి నిఖిల్, నాయకులు సిద్ధు, రవి, సూర్య, ఉదయ్, విద్య, ఆకాంక్ష తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండల ప్రైవేట్ పాఠశాల అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి ఉండాలని, నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు భరత్ చంద్ర మల్లయ్య, కార్యదర్శి విద్యా ప్రవీణ్ పవార్, కాంతి గంగా రెడ్డి, విద్యా గోపికృష్ణ, స్కాలర్స్ వేణు, శాంభవి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పరిసరాల్లోని దుర్గామాత, దత్తాత్రేయ, అయ్యప్ప, ఎల్లమ్మ, హనుమాన్ ఆలయాలను సందర్శించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకిసేవ నిర్వహించారు. భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బి.సుమన్, పీసీ గంగారెడ్డి, మల్లయ్య, కొంతం మురళి, సతీష్, ప్రశాంత్‌గౌడ్, బొండ్ల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



శుభాకాంక్షలు తెలుపుతున్న సీనియర్ సివిల్ జడ్జి నసీం సుల్తానా

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ సభ్యులకు సీనియర్ సివిల్ జడ్జి నసీం సుల్తానా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య, ఉపాధ్యక్షుడు పోడేటి శంకర్, ప్రధాన కార్యదర్శి దేవరశెట్టి అరుణ్ కుమార్, కోశాధికారి తుమ్మ సుకేష్, సంయుక్త కార్యదర్శి సింధుకర్ చరణ్, గ్రంథాలయ కార్యదర్శి సూర సురేష్‌లకు ఎన్నికల అధికారులు గటడి ఆనంద్, తాళ్ల శ్రీనివాస్ పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు భూపతి రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, నరేందర్, జగదీష్, ఏలేటి గంగాధర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులు



ఉత్తమ ర్యాంకులు సాధించిన నలంద విద్యార్థులు



లిల్లీపుట్ పాఠశాల విద్యార్థులు

- 8వ తరగతి విభాగంలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్
- 9,7వ తరగతి విభాగంలో స్టేట్ థర్డ్ ర్యాంక్

నవీపేట్: ఈ–అభ్యాస్ అకాడమీ(హైదరాబాద్) వారు నిర్వహించిన ఒలింపియాడ్ పరీక్షలో మండల కేంద్రానికి చెందిన లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. మార్చి నెలలో జరిగిన ఇంటర్ స్టేట్ లెవెల్ ఒలింపియాడ్ పరీక్షలో లిటిల్ ఫ్లవర్ స్కూల్ 8వ తరగతి విద్యార్థిని మొదటి ర్యాంక్‌ను, 7వ తరగతి విద్యార్థి రాహుల్ 3వ ర్యాంక్, 9వ తరగతి విద్యార్థి విష్ణుష్ 3వ ర్యాంక్ సాధించారు. వీరితో పాటుగా కల్పనాచావ్లా క్రియేటివ్ మైండ్ కాంపిటేటివ్ టెస్ట్‌లో 7వ తరగతి విద్యార్థి రాహుల్ రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంక్, అభిజ్ఞ 3వ ర్యాంక్, 9వ తరగతి విద్యార్థినులు ఇందుప్రియ, అదితిలకు రాష్ట్ర స్థాయి 3వ ర్యాంక్ వచ్చినట్లు స్కూల్ కరస్పాండెంట్ హన్మాండ్లు తెలిపారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ ఇస్రో శాస్త్రవేత్తలు హరినాథ్, రవి కుమార్, ప్రముఖ రచయిత, మాజీ ఆంధ్రభూమి సంపాదకులు ఎంవీఆర్ శాస్త్రి, ట్రస్మా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావు చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారని తెలిపారు.

నలంద విద్యార్థుల ప్రతిభ

పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి నలంద హైస్కూల్ విద్యార్థులు ఒలింపియాడ్ ఐఐటీ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు పాఠశాల యాజమాన్యం లక్కారం ప్రసాద్, లక్కారం సాగర్ సోమవారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఈ–అభ్యాస్ అకాడమీ వారు ఇటీవల నిర్వహించిన ఒలింపియాడ్ ఐఐటీ రాష్ట్ర స్థాయి పరీక్ష పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు వివిధ విభాగాల్లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. అలాగే మామిడిపల్లి లిల్లీపుట్ పాఠశాల విద్యార్థులు సైతం ఒలింపియాడ్ పరీక్షలో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ తెలిపారు. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఇస్రో శాస్త్రవేత్త సుబ్రహ్మణ్యం విద్యార్థులకు షీల్డులు అందజేసినట్లు తెలిపారు.

వైద్య కళాశాలలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్(ఖాళీలు–8), అసిసోయేట్ ప్రొఫెసర్(12), అసిస్టెంట్ ప్రొఫెసర్(7), ట్యూటర్(6), సీనియర్ రెసిడెంట్(3) చొప్పున పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసుకోవడానికి ఎన్నికల కమిషన్ అనుమతి ఇచ్చిందని వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2, 3 తేదీలలో కళాశాలలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 4న మధ్యాహ్నం 12 గంటలకు కళాశాల కార్యాలయంలో అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు www.gmcnzb.org వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

సన్మానం..

పదవీ విరమణ..



బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీజీ హెచ్ఎం మనోహర్ పదవీ విరమణ పొందడంతో సోమవారం పాఠశాల ఆవరణలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆయన ఉపాధ్యాయుడిగా, హెచ్ఎంగా చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కమలాకర్, మండల అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ సభ్యులకు..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కోర్టు బార్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం జీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య, ఉపాధ్యక్షుడు పొండేటి శంకర్‌లను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జీజీ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ నివేదన్ గుజరాతి, న్యాయవాదులు నరేందర్, బొచ్కర్ వీణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్‌కు..

బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్‌లో రాష్ట్ర మినరల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్‌ను స్థానిక పద్మశాలి కులస్తులు సోమవారం ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నాగాభూషణం, సంఘం ప్రధాన కార్యదర్శి రామనాథం, సంఘ నాయకులు మధుకర్, కపిల్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దు



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు



రెంజల్‌లో.. కార్యదర్శి జీవన్ రెడ్డి



కోటగిరిలో .. విండో కార్యదర్శి విఠల్

ఆర్మూర్‌టౌన్: వరి ధాన్యాన్ని రైతులు దళారులకు విక్రయించవద్దని మున్సిపల్ కమిషనర్ ఏ.రాజు సూచించారు. ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఆర్మూర్ మహిళ పట్టణ సమాఖ్య ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం వరి ధాన్యం ఏ- గ్రేడ్ రూ. 2200, బి–గ్రేడ్ రూ.2183 ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. టీఎంసీ ఉదయ్‌శ్రీ, సీవో రాజలింగం, తదితరులు తెలిపారు.

రెంజల్‌లో..



పోతంగల్‌లో ..అధికారి రియాజుద్దీన్

రెంజల్(బోధన్): రెంజల్, దూపల్లి, నీలా గ్రామాల్లో ఆయా గ్రామాల విండోల ఆధ్వర్యంలో కార్యదర్శులు జీవన్‌రెడ్డి, రామాగౌడ్, రాందాస్‌లు కొనుగోలు కేంద్రాలను లాంఛనంగా ప్రారంభించారు. వీరన్న గుట్ట గ్రామంలో ఆగ్రో ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో రైతులు ప్రారంభించారు. కార్యక్రమంలో రైతులు భూంరెడ్డి, ఇమాంబేగ్, మౌలానా, గోసుల గంగాకిషన్, గంగాధర్, శంకర్, ఏఈవోలు పాల్గొన్నారు.

కోటగిరిలో ..

కోటగిరి(రుద్రూర్): కోటగిరి వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం విండో కార్యదర్శి విఠల్ ప్రారంభించారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటను రైతులు మద్దతు ధరకు విక్రయించాలని కోరారు. విండో సిబ్బంది నారాయణ, నవీన్ పాల్గొన్నారు

రుద్రూర్‌లో..

రుద్రూర్: పోతంగల్ మండలం కల్లూర్, హెగ్డోలి, పోతంగల్ గ్రామాల్లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. పోతంగల్ విశాల సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ విస్తరణాధికారులు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ..ధాన్యం తక్కువ ధరకు దళారులకు విక్రయించి నష్ట పోవద్దని సూచించారు. సహకార శాఖ రుద్రూర్ క్లస్టర్ ఆఫీసర్ రియాజుద్దీన్, ఏఈవోలు సుప్రీయ, గౌస్, శంకర్ పాల్గొన్నారు.

చందూర్‌లో..

వర్ని(చందూర్): మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సోమవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ ప్యారం అశోక్ ప్రారంభించారు. ఏఈవో సౌజన్య, సీఈవో భూమయ్య పాల్గొన్నారు.

మాక్లూర్ పరిధిలో..

మాక్లూర్: రైతుల సౌకర్యార్థం సోమవారం కొత్తపల్లి, గుంజిలి, చిక్కిలి, గొట్టిముక్కల, ముల్లంగి(బి) కల్లెడి గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను విండో చైర్మన్ బూరోల్ల అశోక్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాణిక్‌భండార్ శేఖర్, డైరెక్టర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



హెగ్డోలిలో .. ఏఈవో శంకర్



చందూరులో.. సొసైటీ చైర్మన్ ప్యారం అశోక్



కల్లెడిలో .. విండో చైర్మన్ బూరోల్ల అశోక్

వన్య ప్రాణుల దాహార్తి తీర్చేందుకు చర్యలు



కమ్మర్‌పల్లి: వన్య ప్రాణుల దాహార్తి తీర్చేందుకు అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. వేసవి తాపానికి అడవిలోని కుంటలు, ఒర్రెలు, కాలువల్లో నీరు ఇంకిపోవడంతో వన్య ప్రాణులు తాగు నీటి కోసం విలవిలలాడుతున్నాయి. దీంతో కమ్మర్‌పల్లి అటవీ క్షేత్ర పరిధిలోని అటవీ ప్రాంతంలో సాసర్ పిట్ల(నీటి గుంత)లలో నీటిని నింపే చర్యలు ప్రారంభించారు. క్షేత్ర పరిధిలో సుమారు 50 సాసర్ పిట్లు ఉండగా, అందులో వాటర్ ట్యాంకర్ ద్వారా నీరును నింపుతున్నారు.

ఇఫ్తార్ విందులో కాంగ్రెస్ నేతలు



బాల్కొండ: మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర సహకార యూనియన్ బ్యాంకు లిమిటెడ్ కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంజాన్ మాసంలో రోజా గొప్పతనాన్ని గురించి వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (3డీ–తెలుగు) – 11.40, 2.20, 5.00, 7.40, 10.20
స్క్రీన్-2 –	టిల్లు స్క్వేర్ (తెలుగు) – 10.20, 1.20, 4.20, 7.20, 10.20
స్క్రీన్-3 –	ది గోట్ లైఫ్ (తెలుగు) – 11.05, 6.00, 9.40 రజాకార్–2.45
స్క్రీన్-4 –	క్రూ – 10.10, 4.10, 7.00, 10.10 ఓం భీమ్ బుష్ – 04.04

ఆర్టీసీ డిపో ఉద్యోగి మృతికి సంతాపం



నివాళులర్పించి మౌనం పాటిస్తున్న అధికారులు, ఉద్యోగులు

బోధన్: బోధన్ ఆర్టీసీ డిపోలో ఏడీసీగా పని చే స్తున్న నెమలి భాస్కర్ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం డిపో ఆవర ణలో ఉద్యోగి భాస్కర్ మృతి పట్ల సంతాపం తెలిపి అధికారులు, ఉద్యోగులు, కార్మికులు మౌనం పాటించి నివాళులర్పించారు. డిపో మేనేజర్ శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిజామాబాద్ అర్బన్ & రూరల్ రాంనాథ్ : 7997958181
ఆర్మూర్ శివ : 9848956776
బాల్కొండ ప్రశాంత్ : 8919850800
బోధన్ కృష్ణ : 7997958178
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899